సాక్షి
పెద్దపల్లి

బుధవారం। 17। మే। 2023



రైతుల ఆందోళన

ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలని జిల్లాలో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని ఓదెల, ధర్మారం మండలాల్లో రాస్తారోకో నిర్వహించారు. 8లో▸



బాలికా సాధికారత దిశగా..

ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు అన్నిరకాల అంశాలపై అవగాహన కల్పించేందుకు ఎన్టీపీసీ సీఎస్సార్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 10లో▸



వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రోజంతా ఎండగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామగిరిఖిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం



మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్ యాదవ్

కమాన్‌పూర్(మంథని): రామగిరిఖిల్లాను, ఆదివరహస్వామి ఆలయాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కమాన్‌పూర్‌లోని శ్రీఆదివరాహస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కొద్దిరోజుల్లో పర్యాటక కేంద్రంగా మారుతోందని, ఇందుకోసం ప్రభుత్వం రూ.760 కోట్లు కేటాయించడం జరిగిందని వివరించారు. టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం యాదవసంఘం ఆధ్వర్యంలో శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు. పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, కమాన్‌పూర్ ఏఎంసీ చైర్మన్ దాసరి రాయలింగు, జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశంయాదవ్ పాల్గొన్నారు.

పేదలకు ఇండ్లస్థలాలు ఇవ్వాల్సిందే



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: పారిశ్రామిక ప్రాంతంలో ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఇంటిస్థలాలను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. ఈనెల 18న గోదావరిఖనిలో తలపెట్టిన భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. రెండుమాసాలుగా ఇంటిస్థలాల కోసం పేదలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిర్వహించే సభకు సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచేందుకు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు సీపెల్లి రవీందర్, శ్రావణ్, ప్రశాంత్, దిలీప్, మహేశ్, వేణు పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణ మానుకోవాలి



మాట్లాడుతున్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్

గోదావరిఖని: సింగరేణిని ప్రయివేటీకరించే ప్రయత్నాలు మానుకోకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ హెచ్చరించారు. మంగళవారం వకీల్‌పల్లిగనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. ప్రాణాలు సైతం లెక్క చేయకుండా బొగ్గును వెలికి తీసి దేశానికి వెలుగులు అందిస్తున్న సింగరేణి కార్మికులకు సరిహద్దు సైనికులతో సమానంగా సదుపాయాలు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గోదావరిఖనిలో 18వేల ఇంటిస్థలాలను క్రమబద్ధీకరించి పట్టాలిచ్చామని, గ్రామాల్లో ఇందిరమ్మఇళ్లు కట్టించామన్నారు. 30ఏళ్ల పాటు పనిచేసిన కార్మికులకు సొంతింటి కల నెరవేర్చలేక పోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే సింగరేణి కార్మికులకు సొంతింటి కల నెరవేర్చుతామన్నారు. నాయకులు మారెల్లి రాజిరెడ్డి, మహంకాళిస్వామి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇండ్లస్థలాలు కేటాయించాలి

జ్యోతినగర్: ప్రభుత్వం నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.యాకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలోని భూ పోరాట కేంద్రాన్ని సందర్శించారు. నాలుగు భూ పోరాట కేంద్రాలుగా విస్తరించి 6,500కు పైగా దరఖాస్తులు తహసీల్దార్‌కు అందించడం జరిగిందని తెలిపారు. అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. అదే విధంగా సీపీఎం ఇండ్లస్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న భూ పోరాటంలో భాగంగా ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించాలని కోరుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో హైమావతి, శోభ, వినోద, సరిత, వరలక్ష్మి, తదితరులు ఉన్నారు.



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి చిందం శంకరయ్య. గోదావరిఖనిలోని పాత ఫైర్‌స్టేషన్ ఎదుట సోడాలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల పెరిగిన ఎండతీవ్రతకు వడదెబ్బకు గురయ్యాడు. తలనొప్పితో నీరసానికి గురైన శంకరయ్య, ఇలా సోడాల బండి దగ్గరే పడుకున్నాడు. సకాలంలో ఆస్పత్రికి వెళ్లి ట్రీట్మెంట్ తీసుకున్నాడు. ఇలా చాలా మంది సన్‌స్ట్రోక్‌కు గురవుతున్నారు.



మంగళవారం నాటి ఎండతీవ్రతను తెలియజెప్పేలా ఓసీపీ–3 కార్మికుడు బంగారి కనకరాజు ప్రధాన చౌరస్తాలో కోడి గుడ్డు ఆమ్లెట్ వేశాడు. రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండటంతో నడిచౌరస్తాపై ఆమ్లెట్ వేసి పరిస్థితిని ప్రజలకు వివరించాడు.



గోదావరిఖనిలో నిర్మానుష్యంగా మారిన రహదారులు

అగ్ని'గుండం'!

భగ్గుమంటున్న భానుడు.. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు

- రామగుండం నిప్పుల కొలిమి
- నిర్మానుష్యంగా రహదారులు
- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిపాలు
- సింగరేణిపై ఎండ ఎఫెక్ట్.. ఇబ్బందుల్లో కార్మికులు

జిల్లాలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)

తేదీ	గరిష్టం
11	43.3
12	44.5
13	44.7
14	44.8
15	44.4
16	43.8

జీజీహెచ్‌లో ఓపీల వివరాలు

తేదీ	మొత్తం పేషెంట్లు	సీజనల్ వ్యాధులతో వచ్చిన వారు
10	500	180
11	420	150
12	380	120
13	315	100
15	550	200
16	560	210

కోల్‌సిటీ/గోదావరిఖని(రామగుండం): భానుడు భగ్గుమంటున్నాడు. రోహిణి కార్తె ప్రారంభం కాకముందే నిప్పులు కక్కుతున్నాడు.ఎండకుతోడు వడగాడ్పులతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్లలోంచి బయటకు రావడానికి జంకుతున్నారు.ఉదయం పది గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రతకు పలువురు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. జిల్లాలో ఇప్పటికే 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు చేసుకుంటున్నాయి. మరో రెండు, మూడు రోజులు ఇదే పరిస్థితి ఉటుందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నిప్పులు కురిపిస్తున్న భానుడు

మే అంటేనే ఎండలు మండిపోతాయి. ఈనెల 25వ తేదీ నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుంది. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని నానుడి. జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ తదితర ప్రాంతాలలో ఎండలు దంచి కొడుతున్నాయి. సూర్యుడి ప్రతాపానికి జనం నీరసించి పోతున్నారు.వేడిగాలులు వీస్తుండడంతో డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు విలవిల్లాడిపోతున్నారు. కొబ్బరి బొండాలు, గోలిసోడా, కూల్‌డ్రింక్స్, లస్సీ, బట్టర్‌మిల్క్, ఫ్రూట్‌జ్యూస్, ఐస్‌క్రీంలతో ఉపశమనం పొందుతున్నారు.

అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిపాలు

ఎండల తీవ్రతలకు జనం అనారోగ్యానికి గురవుతున్నారు. జీజీహెచ్ ఆస్పత్రితోపాటు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో సీజనల్ వ్యాధులతో చికిత్స కోసం వచ్చే పేషెంట్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వడదెబ్బ లక్షణాలు, తలనొప్పి, జ్వరం, వాంతులు, విరోచనాల సమస్యలతో వస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో వేసవి ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటి పోవడంతో మధ్యాహ్నం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. మధ్యాహ్నం 12గంటల్లోపే ప్రజలు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.

వడదెబ్బతో జాగ్రత్త



వేసవిలో మంచినీరు ఎక్కువగా తాగాలి. శరీర ఉష్ణోగ్రత 106 డిగ్రీల ఫారెన్‌హీట్ దాటితే వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న రోగులు ఎండలో తిరగకూడదు. శరీరంలో ఫ్లూయిడ్స్ లెవల్ తగ్గడంతో వడదెబ్బకు గురవుతారు. కళ్లు తిరగడం, తీవ్రమైన తలనొప్పి, గుండె దడ, చమట ఎక్కువగా రావడం, ఫిట్స్ రావడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఒక్కోసారి కోమాలోకి సైతం వెళ్లవచ్చు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు బయటకు రాకుండా జాగ్రత్త పడాలి.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్, జనరల్ ఫిజీషియన్, జీజీహెచ్, గోదావరిఖని

ఓసీపీలు భగభగ



బొగ్గువేడి, ఎండవేడి మధ్య విధులు

సింగరేణి ఎండవేడికి భగభగలాడుతోంది. ఓసీపీల్లో పనిచేస్తున్న మొదటి, రెండోషిఫ్టు కార్మికులు ఎండవేడికి గురవుతున్నారు. పారిశ్రామిక ప్రాంతం కన్నా ఓసీపీల్లో ఎండవేడి పెరుగుతోంది. బయట 43డిగ్రీలుగా నమోదైతే క్వారీల్లో మరో ఐదు డిగ్రీలు అంటే 48డిగ్రీల దాకా ఉంటోంది. ఈక్రమంలో ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో పనిచేస్తున్న కార్మికులు భయాందోళన చెందుతున్నారు. క్వారీలో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్లు, ట్రిప్‌మెన్లు, ఓవర్‌మెన్‌లు ఎండవేడి భరిస్తూనే విధులు నిర్వహించాల్సిన ప రిస్థితి ఏర్పడింది. ఎండవేడి నుంచి కార్మికులకులకు ఉపశమనం కలిగించేందుకు ఓసీపీ క్వా వ్రీ, డంప్‌యార్డుల వద్ద చలువ పందిళ్లు, రంజన్లు ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్నారు. ఏసీలు ఉన్న డంపర్లు, షవల్స్, డోజర్లను మాత్రమే నడిపిస్తున్నారు. ఓసీపీల్లో ఎండ తీవ్రత దృష్ట్యా పనివేళలు మార్చాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

పైసల్ పడ్తలేవు!

- వారం కిందనే ధాన్యం విక్రయించిన రైతులు
- ఇంతవరకు ఖాతాల్లో జమకాని యాసంగి డబ్బులు
- డబ్బుల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా..మారని పరిస్థితి



ధాన్యం లోడ్ చేస్తున్న హమాలీలు(ఫైల్)

తేదీ 15-05-2023 వరకు ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	సేకరించిన ధాన్యం	మిల్లులకు తరలించింది	మిగిలింది
కరీంనగర్	1,36,064.496	1,34,948.957	1,115.539
జగిత్యాల	1,59,627.092	1,39,929.690	19,697.402
పెద్దపల్లి	1,00,763.720	97,667.340	3,096.380
రాజన్నసిరిసిల్ల	92,948.940	85,073.420	7,875.520
మొత్తం	4,89,404.248	4,57,619.407	31,784.841

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆరుగాలం కష్టపడి కష్టనష్టాలకు ఓర్చి, వడగండ్లు, కడగండ్లను దాటుకుని కొనుగోలుకేంద్రాలకు చేర్చిన ధాన్యం అకాల వర్షానికి కొట్టుకుపోగా మిగిలిన పంటను రైతులు అమ్ముకున్నారు. విక్రయించి వారం దాటినా.. ఇంతవరకూ నయాపైసా జమకాకపోవడంపై అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. వేసవికాలం పంట కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా.. ఇంకా డబ్బులు రైతుల ఖాతాలో పడకపోయేసరికి రైతు కుటుంబాలు దిగులు చెందుతున్నాయి.

తగ్గిన దిగుబడి

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా రైతులంతా వరిసాగుకే మొగ్గుచూపుతారు. ఈసారి మార్చిలోనే ఈదురుగాలులు వడగండ్లతో వాణిజ్యపంటలు నేలమట్టమయ్యాయి. చాలాచోట్ల వరిపంట కూడా దెబ్బతింది. కానీ, ప్రకృతి కోపానికి ఎదురొడ్డి నిలిచి, వాతావరణ ప్రతికూలతలు తట్టుకుని నిలబడినా వరికోత సమయానికి అకాలవర్షాలు, వడగండ్లు వరుసగా దాడి చేశాయి. పంట దిగుబడి చాలా తగ్గింది. కరీంనగర్‌లో 2.71 లక్షలు, పెద్దపల్లిలో 2.00 లక్షలు, జగిత్యాలలో 2.97 లక్షలు, సిరిసిల్లలో 1.71 లక్షల ఎకరాల చొప్పున పంట వేశారు. ఇందులో కరీంనగర్‌లో దాదాపు 56,066, సుమారు జగిత్యాలలో 65,794, సిరిసిల్లలో సుమారు 18,230 ఎకరాలు, పెద్దపల్లిలో దాదాపు 36,596 ఎకరాల మేర పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు సర్వే ద్వారా నిర్ధారించారు. ఈ గణాంకాల్లో స్వల్ప వ్యత్యాసాలు కూడా ఉండొచ్చు.

వారంరోజులు దాటినా.. అందని డబ్బులు..

ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించింది. వెంటనే కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించింది. ఎంతో కష్టపడి చివరికి అన్నదాతలు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అక్కడా మళ్లీ గాలులు, వడగండ్లతో ప్రకృతి పగబట్టిందా? అన్న స్థాయిలో వరుణదేవుడు విరుచుకుపడ్డాడు. వర్షపునీటికి కొట్టుకుపోగా మిగిలిన ధాన్యాన్ని ఎట్టకేలకు విక్రయించారు. విక్రయించే సమయంలోనూ తాలు, గడ్డి, మట్టిబెడ్డలు, తేమ శాతం పేరు చెప్పి క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు తరుగు పేరిట రైతులను కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ధాన్యాన్ని విక్రయించిన చాలా మంది రైతులు వారం గడిచినా డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని వీలైనంత త్వరగా ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

డబ్బులు పడలేదు..



నేను ఈ నెల 4వ తేదీన ధాన్యం కాంట వేశారు. 9వ తేదీన రిసిప్ట్ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు నా ఖాతాలో డబ్బులు జమ కాలేదు. సెంటర్ నిర్వాహకులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే డబ్బులు జమ చేయాలి.

– పాకాల అనిల్‌రెడ్డి, జగ్గయ్యపల్లి, మానకొండూరు

పది రోజులైంది



నాలుగు ఎకరాలలో ఈ యాసంగిలో వరి పంట వేసిన. నాలుగు ఎకరాలలో 230బస్తాల (40కిలోల సంచి)దిగుబడి వచ్చింది. పది రోజుల క్రితం ధాన్యంను కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్న. క్వింటాలకు 4.60 కిలోల తరుగు పేరుతో కటింగ్ పెట్టారు. ఇన్నిరోజులవుతున్నా పైసలు పడలేదు.

– మారం తిరుపతిరెడ్డి, రైతు, హిమ్మత్‌నగర్, వీణవంక

వారం రోజులు అవుతుంది



ఈ సీజన్‌లో 90 క్వింటాళ్ల వరి ధాన్యం పండింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించి వారం రోజులు అయ్యింది. లారీలో ధాన్యం తరలించారు. ఇప్పటికి నాకు డబ్బులు రాలేదు.

– ఆకుల పెద్ద గంగారెడ్డి, కథలాపూర్

నిర్లక్ష్యంతోనే ఆలస్యం



గతంలో పది రోజులో డబ్బులు జమ అయ్యేవి.. కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ చేస్తే ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. నిర్వాహకులు ఎప్పటికప్పుడు రైతుల జాబితాను, వారి వడ్లు ఎంత మొత్తంలో అమ్మకం చేశారో ఆన్‌లైన్ చేస్తే వెంటనే బ్యాంకు ఖాతాలో అధికారులు జమ చేసేవారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యమవుతుంది.

– గెల్లు చిరంజీవి, యాదవ్‌నగర్, సుల్తానాబాద్

బీసీలపై కాంగ్రెస్, బీజేపీ వివక్ష

- శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్
- మంథనిలో బీపీ మండల్ విగ్రహావిష్కరణ



విగ్రహం ఆవిష్కరిస్తున్న బండప్రకాశ్, తదితరులు

మంథని: దేశాన్ని పాలించిన కాంగ్రెస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీలు ఎనాడూ బీసీల గురించి ఆలోచన చేయలేదని, వివక్ష చూపాయని శాసనమండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్ విమర్శించారు. మంగళవారం మంథనిలోని బొక్కలవాగు వంతెనపై పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఓబీసీ రెండో జాతీయ కమిషన్ చైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండళ్ విగ్రహాన్ని బీపీ మండల్ వారసుడు సూరజ్ మండళ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. 1956లోనే కాకా కలేల్కర్ కమిషన్ రిపోర్టు ఇచ్చినా అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంతో చెల్లకుండా పోయిందన్నారు. ఇటీవల బీసీ గోస బీజేపీ యాత్ర అంటూ కొంతమంది యాత్రలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మంథనిలో బీపీ మండళ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. బీపీ మండళ్ సేవలను గుర్తించి మంథనిలో విగ్రహం నెలకొల్పడం ఆనందంగా ఉందని బీపీ మండళ్ వారసుడు సూరజ్ మండల్ అన్నారు. మహనీయుల చరిత్రపై గ్రామాల్లో చర్చ పెట్టాలని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ అన్నారు. మన చరిత్రను సమాజానికి అందించే బాధ్యతను తీసుకుని మహనీయుల విగ్రహాలు నెలకొల్పుతున్నట్లు జెడ్పీ చైర్మన్ పుట్టమధు వివరించారు. బహుజన సేన వ్యవస్థాపకుడు కదిరె కృష్ణ, జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్,, కవి, రచయిత జయరాజ్, డేగ సమ్మయ్య, వాసుకే యాదవ్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సంగీత, తదితరులు

పెద్దపల్లిరూరల్: వానాకాలం పంటలు సాగుచేసే రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టేందుకు యత్నించే వారి ఆటను కట్టించేందుకు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని వ్యవసాయమంత్రి నిరంజన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ, పోలీసు అధికారులకు సూచించారు. సచివాలయం నుంచి మంగళవారం వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. అవసరమైన నాణ్యమైన విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు.

పత్తి విత్తనాలపైనే ప్రత్యేకదృష్టి: కలెక్టర్ సంగీత

జిల్లాలో వానాకాలం పంటసాగుకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ సంగీత అన్నారు. పత్తి విత్తనాలను బట్టసంచుల్లో పొరుగురాష్ట్రాలనుంచి తరలిస్తున్నారని, హెచ్‌టీ కాటన్‌కు చట్టబద్ధమైన అనుమతిలేదన్నారు. నకిలీ విత్తన నియంత్రణకు ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అన్నారు. తనిఖీ సమయంలోనే టెస్ట్ కిట్‌లు వెంట ఉంచుకోవాలన్నారు. డీఏవో ఆదిరెడ్డి, ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, డీసీవో మైఖేల్‌బోస్ ఉన్నారు.

ఈ– పాస్‌యంత్రాలతోనే ఎరువులివ్వాలి

ఎరువులు, విత్తనాలు ఈ– పాస్ యంత్రాలతోనే విక్రయించాలని కలెక్టర్ సంగీత ఆదేశించారు. మంగళవారం వ్యవసాయాధికారులు, ఎరువులు, విత్తనడీలర్లతో సమావేశమయ్యారు. జిల్లాలో 40శాతం మార్క్‌ఫెడ్‌ద్వారా, 20శాతం ఆగ్రోద్వారా, 40శాతం ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సకాలంలో సరఫరా అందిస్తామన్నారు. జిల్లాలో 33వేల323 మెట్రిక్‌టన్నుల యూరియా, 8,552 మెట్రిక్ టన్నుల డీఏపీ, 7,125 మెట్రిక్‌టన్నుల ఎస్ఎస్‌పీ, 250 మెట్రిక్‌టన్నుల కంపోస్టు, 75,338 మెట్రిక్‌టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అన్నారు. ప్రస్తుతం 35,654 మెట్రిక్‌టన్నుల ఎరువులున్నాయని వివరించారు.

క్లుప్తంగా

జాబ్‌మేళాకు స్పందన



మేళాకు హాజరైన యువత

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో మంగళవారం శివసాయి మల్టీప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు నిర్వహించిన జాబ్ మేళాకు మంచి స్పందన లభించింది. పెద్దపల్లి ప్రాంతంలోనే మండల, జిల్లాస్థాయి సూపర్‌వైజర్ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు పలు ప్రాంతాలనుంచి 92 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారని కంపెనీ ప్రతినిధి కమల తెలిపారు.

కల్చరల్ టూరిజం జిల్లా శాఖ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న సతీశ్

కమాన్‌పూర్(మంథని): రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం అభివృద్ధికి ఏర్పాటు చేసిన కార్పొరేషన్ తరహాలో జిల్లాలో కల్చరల్ టూరిజం జిల్లా శాఖలను ఏర్పాటు చేయాలని మంథని మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన కాసిపేట సతీశ్ కోరారు. మంగళవారం రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పోస్టులు ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగులకు ఉపాధితో పాటు టూరిజం అభివృద్ధి చెందుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

సన్మానం

పెద్దపల్లిరూరల్: రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి తొలిసారి పెద్దపల్లికి వచ్చిన గెల్లు శ్రీనివాస్‌ను మంగళవారం స్థానిక నాయకులు శాలువాతో సత్కరించారు. ఉప్పు శివకుమార్, బండి సురేశ్, సతీష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

హత్య, చోరీ కేసులో ఒకరికి జీవితఖైదు

గోదావరిఖనిటౌన్(రామగుండం): హత్య, చోరీ కేసులో గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన గుమ్మడి శ్రీకాంత్(28)కు గోదావరిఖని అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు జడ్జి టి.శ్రీనివాస్‌రావు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధించారు. వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన కోట రాజయ్య 15.07.2017న రాత్రి 10.30 గంటలకు నైట్ డ్యూటీకి వెళ్లాడు. అతడి భార్య రాజేశ్వరి ఇంట్లో ఒక్కతే ఉన్నది. మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు రాజయ్య డ్యూటీ నుంచి ఇంటికి వచ్చి చూడగా తన భార్య చనిపోయి ఉంది. ఆమె మెడలో రెండు తులాల పుస్తెల తాడు దొంగిలించి, గొంతుసులిమి చాకుతో పొడిచి చంపినట్టు అప్పటి ఎస్‌ఐ జి.రమేష్‌బాబు కేసు నమోదు చేసి సాక్షులను ప్రవేశపెట్టారు. సీఐ జి.క్రిష్ణ విచారణ చేసి నిందితుడిని అరెస్ట్ చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు పంపించారు. తర్వాత సీఐ ఎస్.వాసుదేవరావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, గోదావరిఖని అడిషనల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టులో కేసు విచారణ జరిగింది. జడ్జి టి.శ్రీనివాస్‌రావు ఇరువురి వాదనలు విని మంగళవారం నేరస్తుడు గుమ్మడి శ్రీకాంత్ హత్య, దొంగతనం నేరం రుజువైనందున అతడికి జీవితఖైదు, జరిమానా విధించారు.

కటింగ్ లేకుండా ధాన్యం కొనాలి



పత్తిపాక క్రాస్ రోడ్డు వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు



కొలనూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

- పత్తిపాక క్రాస్‌రోడ్డుపై రైతుల రాస్తారోకో
- కొలనూర్‌లో 2గంటల పాటు నిరసన

ధర్మారం: నాసిరకం ధాన్యం పేరుతో రైసు మిల్లర్లు కటింగ్ చేస్తూ ముంచుతున్నారని ధర్మారం మండలం పత్తిపాక క్రాస్‌రోడ్డుపై మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. కరీంనగర్, మంచిర్యాల వెళ్లే వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలానికిచేరుకుని రైతులతో చర్చించినా ఫలితం లేకుండా పోయింది. ధర్మపురివైపు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ ఆందోళనలో పాల్గొన్నారు. పార్టీలకతీతంగా చేస్తున్న తమ ఆందోళనలో నాయకులు ఉండరాదని బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు అభ్యంతరం తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రైతులు తాము సమాచారం ఇస్తేనే వచ్చాడని, ఎందుకు రాకూడదని ఎదురుతిరిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఇదే సమయంలో తహసీల్దార్ రైస్ మిల్లర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారని ఎస్సై హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన తహసీల్దార్ రైస్‌మిల్లు యాజమానితో మాట్లాడి కటింగ్ లేకుండా ధాన్యం తీసుకోవాలని ఆదేశించారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. కేంద్రంలో క్వింటాల్‌కు రెండున్నర కిలోలు కటింగ్ చేస్తుండగా, రైస్ మిలర్లు అదనంగా మరో రెండు కిలోలు కటింగ్ చేయటమే కాకుండ కామన్‌రకం ధరను ఇస్తూ, తీరని అన్యాయం చేస్తున్నారని వాపోయారు. నిబంధనల ప్రకారంగానే తూకం వేస్తుండగా కటింగ్‌పేరుతో ముంచుతున్నారని అన్నారు.

కొలనూరులో రైతుల ఆందోళన

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మండలం కొలనూర్‌లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, కటింగ్ పేరిట మోసం చేస్తున్నారని రైతులు ఆందోళనకు దిగారు. ఐకేపీ సెంటర్ సమీపంలోని ప్రధానరహదారిపై 100మంది రైతులు రెండుగంటల పాటు నిరసనకు దిగారు. వారం రోజుల నుంచి సెంటర్‌కు లారీలు రాకపోవడంతో ధాన్యం పేరుకుపోతోందని అన్నారు. ఓదెల తహసీల్దార్ రమేశ్, పొత్కపల్లి ఇన్‌చార్జి ఎస్సై లక్ష్మిరాజం, కాల్వశ్రీరాంపూర్ ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): సీఎం కేసీఆర్ పాలనలో అన్నివర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు గుమ్ముల పోచయ్య, నర్సయ్య ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో వివిధ పార్టీలకు చెందినవారు బీఆర్ఎస్‌లో చేరగా మంత్రి వారిని ఆహ్వానిస్తూ పార్టీ కండువాలు కప్పారు. అనంతరం మండలంలోని సాయంపేట గ్రామంలో చిన్ననీటి వనరుల పునరుద్ధరణలో భాగంగా రూ.31.55 లక్షల అంచనాలతో కుమ్మరోల్ల మాటుకు, రూ.26.60 లక్షల అంచనా వ్యయంతో సవటకాల్వమాట్ నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. గంగపుత్రులు, ముదిరాజ్‌లను ఆర్థికంగా వృద్ధి చేసేందుకు కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయలు వెచ్చించి 40వేల చెరువులకు మరమ్మతులు చేయించారని వివరించారు. స్థానిక సమస్యలను పరిష్కారం చేస్తానని ఇందులో భాగంగానే చేపల మార్కెట్‌కు ప్రభుత్వం ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు బాస తిరుపతిరావు, ఉపసర్పంచ్ ఆవుల లత తదితరులు పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థికి మంత్రి అభినందన



సాన శ్రీహితను సన్మానిస్తున్న మంత్రి ఈశ్వర్

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నల్లలింగయ్యపల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని సాన శ్రీహితను మంగళవారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సన్మానించారు. 5వ తరగతి నుంచి పదో తరగతి వరకు చింతకుంట ప్రభుత్వ గురుకులంలో చదివిన శ్రీహిత ఇంటర్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిజామాబాద్ గురుకులంలో పూర్తి చేసింది. ఇటీవల ఇంటర్ ఫలితాల్లో బైపీసీలో 977 మార్కులు సాధించింది. మరింత కష్టపడి ఉన్నత చదువులు పూర్తిచేయాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉషారాణికి అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉషారాణి

గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని పట్టణానికి చెందిన పొట్ట ఉషారాణి ఈనెల 14న హైదరాబాద్ రవీంద్రభారతిలో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ గాయని, గేయ రచయితగా బంగారు నంది అవార్డు అందుకుంది. ఉషారాణి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్, నాలెడ్జ్ సెంటర్ మెంటర్‌గా విధులు నిర్వహిస్తూనే ఖాళీ సమయంలో పాటలు పాడుతూ, గేయ రచయితగా రాణిస్తున్నారు. రవీంద్ర భారతిలో శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఏపీ మాజీ మంత్రి పుష్పలీల, సినీ తారలు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, హైదరాబాద్ శ్రీనగర్ ఏసీపీ, ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సత్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకొచ్చిన దంపతులు



సంపత్‌కు అభినందన పత్రం అందజేస్తున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రతినిధి రాజమౌళి

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని లక్ష్మీనగర్‌లోని అంబికా హాస్పిటల్ మెడికల్ షాప్ నిర్వాహకుడు కొండ సంపత్ ఆయన భార్య రమాదేవి తమ మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చారు. వారి పెళ్లి రోజును పురస్కరించుకొని ఈ నిర్ణయం తీసుకున్న దంపతులను సోమవారం రాత్రి ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, సదాశయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రాజమౌళి, ప్రతినిధి వాసు అభినందించారు. సదరు దంపతులకు అభినందన పత్రంతోపాటు డోనర్ కార్డులను డాక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ, నేత్రదానం చేయడానికి తన హాస్పిటల్ సిబ్బంది సంపత్ ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. ప్రజలు మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హాస్పిటల్ నిర్వహణ ఇన్‌చార్జి వేణుగోపాల్, సిబ్బంది సురేష్, సాగర్, శ్రావణ్, అబ్జల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంగీత సత్యనారాయణ

ఓదెల(పెద్దపల్లి): హైదరాబాద్‌లో జరిగిన కరాటే నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఓదెల హైస్కూలుకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. కటాఫ్, ఫస్ట్‌స్నేక్ విభాగంలో ఇ.చందన, ఎల్.తేజస్వి, ఎం.సాత్విక, ఎం.వర్షిత, ఎ.హరిక్షేత్ర, ఎం.సౌజన్య, ఎం.అక్షిత బంగారు పతకాలు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను మంగళవారం పెద్దపల్లిలో కలెక్టర్ సంగీతసత్యనారాయణ, డీఈవో మాధవి అభినందించారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ కె.మొండయ్య, మాస్టర్ కల్వల రమేశ్, ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాహిత వేదిక పోరాటం



సమావేశంలో ప్రజాహిత వేదిక నాయకులు

ఎలిగేడు(పెద్దపల్లి): రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తూ, ప్రజల్లో చైతన్యం తీసుకవచ్చి, సమస్యల పరిష్కారంకోసం పోరాటం చేస్తామని ప్రజాహిత వేదిక నాయకులు ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, మాజీ ఎంపీపీ, ప్రముఖ న్యాయవాది సి. సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలుపర్చాలనే డిమాండ్‌తో ప్రజాహిత వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ 2014లో ఎన్నికల మెనిఫెస్టోలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ప్రకటించి, 2018లో రైతులకు ఒకేసారి రూ.లక్ష వరకు రుణమాఫీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అని చెప్పి హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజాహిత వేదిక వలంటీర్ల ద్వారా గ్రామాల వారీగా నిరుద్యోగులను గుర్తించి, రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి మండల, జిల్లాస్థాయిలో ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. ప్రగతిభవన్, సెక్రెటరియేట్‌లో వినతులు అందజేసి సమస్యల పరిష్కారం కాకుంటే హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా సైతం చేపడుతామని వివరించారు. నాయకులు కాంపెల్లి ప్రభాకర్, హరిపురం ఉపసర్పంచ్ గ్యారవేని నాగరాజుయాదవ్, మ్యాదరవేని రాజుయాదవ్, మాదరవేని రాకేశ్, పలుమారు తిరుపతి, నక్క మల్లయ్య, గుండేటి ఎల్లయ్య, తంగెళ్ల శ్రీనివాస్, సబ్బు గట్టయ్య, ఎనగంటి మల్లయ్య, కౌెట్టి రాజేందర్ పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

భారీ యంత్రాలపై రక్షణ చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సుధీర్‌గణపతిరావు

- డీఎంఎస్ సుధీర్‌గణపతిరావు

గోదావరిఖని(రామగుండం): భారీ యంత్రాలపై ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని మెకానికల్ డీఎంఎస్ సుధీర్‌గణపతిరావు సూచించారు. మంగళవారం భారీ యంత్రాల నిర్వహణ, ప్రమాదాల నివారణపై ఒక్కరోజు వర్క్‌షాప్ స్థానిక ఇల్లెందు క్లబ్‌లో జరిగింది. ఈసందర్భంగా డైరెక్టర్ మైన్స్‌సేఫ్టీ మాట్లాడుతూ, సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో నడిచే భారీ యంత్రాలపై ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. రక్షణ చర్యల విషయంలో రాజీ పడవద్దని, ప్రమాదాలు జరగకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డైరెక్టర్లు ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, రక్షణ గురించి సింగరేణి తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాలు అరికట్టేందుకు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించారు. వర్క్‌షాప్‌లో డీఎంఎస్‌లు నోముల సంజీవ్‌కుమార్, దిలీప్‌కుమార్, జీఎంలు సీహెచ్.నర్సింహారావు, గురువయ్య, చింతల శ్రీనివాస్, మనోహర్, టీవీ రావు, బళ్లారి శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.సాంబయ్య, ఏరియా ఇంజినీర్లు, ప్రాజెక్టు అధికారులు, ఏరియా సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్స్‌ను పరిశీలించిన ఆర్జీ–3 జీఎం



మోడల్స్‌ను పరిశీలిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

కమాన్‌పూర్(మంథని): మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఆరు బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు తయారు చేసిన వివిధ మోడల్స్‌ను మంగళవారం ఆర్జీ–3 జీఎం వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. రెండురోజులుగా కళాశాలలో జాతీయస్థాయి సాంకేతిక టెక్నికల్, నాన్ టెక్నికల్ ఫెస్ట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా మైనింగ్ విద్యార్థులు తయారు చేసిన మినేరియా మోడల్స్, ఓపెన్ కాస్టు మైన్స్‌తో పాటు గ్యాసిఫికేషన్ గని, షాఫ్ట్ మోడల్స్‌ను పరిశీలించగా, వాటి పనితీరును జీఎంకు విద్యార్థులు వివరించారు. జీఎం వెంట కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఎస్‌హోటూ జీఎం రఘుపతి, వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, దుర్గారావు, సతీశ్, రవికుమార్ ఉన్నారు.

హామీలు అమలు చేయాలి

కమాన్‌పూర్(మంథని): సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1 గేట్‌లో కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 2018లో కాంట్రాక్టు కార్మికులకు పెన్షన్ పేరిట 7 శాతం చెల్లిస్తామని యాజమాన్యం చెప్పి నేడు అమలు చేయకపోవడంతో కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు పూర్తికాక, వాటి వివరాలు ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రతి కార్మికుడికి బ్యాంకు ఇన్సూరెన్స్ చేయిస్తామని చెప్పిన యాజమాన్యం కార్మికులను మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని లేకుంటే సింగరేణి వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాజనర్సు, రాజమౌళి, శ్రీనివాస్, సంపత్, రమేష్, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

‘అధికారిపై దాడి సరికాదు’



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): జవహర్‌ఖని ఓసీపీ సేఫ్టీ అధికారి శివప్రసాద్‌పై ఉద్యోగి దాడిచేయడం సరికాదని, ఖండిస్తున్నామని అధికారుల సంఘం అధ్యక్షుడు పానగోటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. విధులకు హాజరయ్యేందుకు వెళ్తున్న సమయంలో సేఫ్టీ అధికారిని అడ్డగించి బెదిరింపులకు గురిచేసి దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డ ఉద్యోగిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు జి.డేవిడ్, చిలుక శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ఆంజనేయులు, నవీన్, ప్రభాకర్, శ్రీధర్, రాజన్న, శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, వీరారెడ్డి పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



కారుణ్య నియామక పత్రాలు అందజేసిన జీఎం

కమాన్‌పూర్(మంథని): సింగరేణి ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో మంగళవారం నలుగురికి కారుణ్య నియామక పత్రాలను జీఎం టి.వెంకటేశ్వర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, జాగ్రత పని చేసుకొని ఉద్యోగాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. కారుణ్య నియామకాల్లో ఉద్యోగం పొందిన వారిలో 350 మంది విధులకు గైర్హాజరు కావడంతో వారిని కంపెనీ డిస్మిస్ చేసిందని వివరించారు. క్రమ శిక్షణతో పని చేసి సంస్థలో పర్మినెంట్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు నరేందర్, రఘుపతి, రవీందర్‌రెడ్డి, మారుతి, రాజేశం ఉన్నారు.

ప్రైవేట్ యంత్రాలను ప్రవేశపెడితే ఊరుకోం



ఆందోళన చేస్తున్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): జీడీకే–5 ఓసీపీలో ప్రైవేట్ యంత్రాలను ప్రవేశపెడితే ఊరుకోమని ఏఐటీయూసీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం జీడీకే–5 ఓసీపీ వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న యంత్రాలతో కార్మికులచే రికార్డు స్థాయి బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామన్నారు. అయినా ప్రైవేట్ యంత్రాలు ప్రవేశపెట్టడం బాధాకరమన్నారు. పాత యంత్రాలు పనిచేయడం లేదనే సాకుతో యాజమాన్యం కొత్త యంత్రాలను కొనుగోలు చేయకుండా, ప్రైవేటు వారికి చెందిన షవల్స్, లోడర్, డోజర్‌లను ప్రవేశపెట్టాలని చూస్తోందన్నారు. దీంతో కార్మికులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందని, వీటిని ఉపసంహరించేదాకా ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, మాదన మహేష్, గుర్రం ప్రభుదాస్, వేల్పుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

సుల్తానాబాద్(పెద్దపల్లి): జూన్ 10న నిర్వహించే లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి జీఎస్‌ఎల్ ప్రియాంక అన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని సీఐ ఇంద్రసేనారెడ్డి, సుల్తానాబాద్, శ్రీరాంపూర్, జూలపల్లి ఎస్‌ఐలు విజేందర్, శ్రీనివాస్, వెంకటకృష్ణతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీ కోసం ప్రయత్నం చేసుకునే కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా వారికి సహకరించాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించబడే పలు చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల గురించి పరిశీలించారు. ఇరువర్గాల కక్షిదారులు సామరస్యంగా రాజీ చేసుకునేందుకు లోక్ అదాలత్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

కర్ణాటక తరహాలో సీపీఎస్ రద్దు చేయాలి

మంథని: కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు లింగం శ్రీనివాస్ కోరారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తే ఆర్థిక, సంక్షేమ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు.